బీఎల్‌ఆర్‌ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత


బండారి లక్ష్మారెడ్డి సోదరుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కాప్రా: ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల వెంకట్‌రెడ్డి సతీమణి పద్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకుని సైనిక్‌పురిలోని వారి నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు ఉన్నారు.

కష్టపడి పనిచేసేవారికి తగిన ప్రాధాన్యం


ఎమ్మెల్సీ కవితతో మాజీ కార్పొరేటర్‌ పుష్పలతారెడ్డి

మౌలాలి: పార్టీలో కష్టపడి పని చేసేవారికి ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. వినాయక్‌నగర్‌ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ పుష్పలత ఆమె నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రానున్నది బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అని కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. నాయకులు బద్దం పరశురాంరెడ్డి, హేమంత్‌, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

అల్వాల్‌ ఎస్‌హెచ్‌ఓకు జాతీయ అవార్డు


సైబరాబాద్‌ సీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఐ రాహుల్‌దేవ్‌

అల్వాల్‌: అల్వాల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న రాహుల్‌దేవ్‌కు జాతీయ ఉత్తమ పోలీస్‌ అవార్డు లభించింది. భారతదేశంలో శాశ్వత పోలీసు సిబ్బంది, ఇతర సహాయక సిబ్బందికి పథకంలో భాగంగా సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌దేవ్‌ మాట్లాడుతూ.. జాతీయ అవార్డు రావడం ఆనందగా ఉందని, పోలీస్‌ వ్యవస్థ కోసం మరింత కృషి చేస్తానన్నారు.

సామూహిక కుంకుమార్చన


ప్రత్యేక పూజల్లో భక్తులు

బోడుప్పల్‌: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని కృష్ణ ఆలయ త్రయోదశ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మహిళలు శుక్రవారం కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి పలు పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్‌ అంజి పటేల్‌, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ చింతల శాంతి

అల్వాల్‌: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని అల్వాల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ చింతల శాంతి అన్నారు. పాల అల్వాల్‌ పోచమ్మ ఆలయ సమీపంలో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు వరుణ్‌, రామరావు, అరుణ్‌, సాజిద్‌, లింగారెడ్డి, సంగమ్మయ్య తదితరులు ఉన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన

కీసర: చీర్యాల గ్రామంలోని చైతన్యయూత్‌ వద్ద సైబర్‌ క్రైం పోలీసులు శుక్రవారం గ్రామస్తులకు సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లక్ష్మణ్‌ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్‌ చేయాలని సూచించారు.

అడ్డగోలు దోపిడీ..!

మీ-సేవా కేంద్రాల నిర్వాహకుల ఇష్టారాజ్యం

- నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా వసూళ్లు
- అడిగిన ప్రజలపై ఆగ్రహం, నిర్లక్ష్య సమాధానం

కాప్రా: ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉండాల్సిన కొందరు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు దరఖాస్తుదారుల నుంచి అధిక రుసుం వసూళ్లు చేస్తూ అడ్డగోలు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పలు రకాల సేవలు వేగంగా, సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో సర్కారు మీ-సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే తమకు సంబంధించిన కొన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు మీ-సేవా సెంటర్ల ద్వారా తీసుకోవచ్చు. అయితే ఇదే అదునుగా ధ్రువీకరణ పత్రాల కోసం మీ-సేవా కేంద్రాలకు వెళ్తున్న ప్రజల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. కొందరు మీ-సేవా నిర్వాహకులు ప్రభుత్వ కార్యాలయాల్లోని కొందరు సిబ్బందితో కుమ్మక్కై అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సాధారణంగా కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందాలంటే రూ. 45 చొప్పున ఫీజు చెల్లించాలి. కానీ కొందరు మీ సేవా నిర్వాహకులు రూ.500లకు పైగా వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. రసీదులో మాత్రం రూ.45 చెల్లించినట్లు ఉంటుందని కానీ తీసుకునేది రూ. 500 లకు పైగా వసూలు చేస్తున్నారని జనం వాపోతున్నారు. అధిక వసూళ్లపై ఎవరైనా అడిగితే సర్టిఫికెట్‌ కావాలంటే ఇవ్వాల్సిందే అని లేకుంటే వెళ్లిపోవాలని చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే మీసేవలో తీసుకోవాలంటారు, మీసేవకు వెళ్తే అధిక ధరల వసూళ్లతో తమ జేబులు ఖాళీ అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు..



కొందరు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే ప్రతి మీ-సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే తక్షణమే మా దృష్టికి తీసుకువస్తే సంబంధిత కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ చెల్లించొద్దు.

–సుచరిత, తహసీల్దార్‌, కాప్రా మండలం

మార్కెట్లోకి భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌

వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం



ఇంజినీర్స్‌ మీట్‌ను ప్రారంభిస్తున్న భారతి సిమెంట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ ఎంసి మల్లారెడ్డి, అసిస్టెంట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ కొండల్‌ రెడ్డి

ఉప్పల్‌: నాగోల్‌ మెట్రోస్టేషన్‌ సమీపంలోని ఎస్‌వీఎం గ్రాండ్‌ హోటల్‌లో ఇంజినీర్స్‌ మీట్‌ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డా.రూపేశ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. మన్నిక, నాణ్యతపై అనేక ప్రయోగాలు చేశామని సిమెంట్‌ మన్నికపై ఇంజినీర్లకు వివరించారు. భారతి సిమెంట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ ఎంసీ మల్లారెడ్డి, అసిస్టెంట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ కొండల్‌ రెడ్డి మాట్లాడుతూ.. ఇతర సిమెంట్‌తో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక పేర్కొన్నారు. తమ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు సైట్‌ వద్దకే వచ్చి సహాయ పడతారని సూచించారు. కార్యక్రమానికి మహానగరంలోని ఇంజినీర్లు, భారతి సిమెంట్‌ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక


వాణీనగర్‌ విజయ వినాయక ఆలయ నూతన కమిటీ

గౌతంనగర్‌: దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కే. మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకన్న సమక్షంలో వాణీనగర్‌ విజయ వినాయక ఆలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా సిరిగిరి రాజు, సభ్యులుగా వీపీ. సత్యనారాయణ, లక్ష్మి, వీరభద్రరావు, బలరాం, జన్నయ్య పెంటయ్య, చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ వై. ప్రేంకుమార్‌, బీ-బ్లాక్‌ అధ్యక్షులు టి. వెంకటేశ్‌యాదవ్‌, జీఎస్‌వీ. సతీశ్‌కుమార్‌, గుండా నిరంజన్‌, బీకే. శ్రీనివాస్‌, సంతోష్‌ రాందాస్‌, సంపత్‌గౌడ్‌ వైనాల ప్రవీణ్‌కుమార్‌, సత్యనారాయణ, పరమేశ్‌, ఫరీద్‌, రాంచందర్‌, కన్నెమళ్ల నాగరాజు, బాల్‌రాజ్‌యాదవ్‌, శంకర్‌, ఇస్తారి, యాదగిరి, కుట్టి శ్రీను, కన్నా తదితరులు ఉన్నారు.

జేఎంఎల్‌బీసీ, బీఎల్‌బీసీ సమావేశాలు



కాప్రా: సర్కిల్‌ కార్యాలయంలో జేఎంఎల్‌బీసీ, బీఎల్‌బీసీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కాప్రా, అల్వాల్‌, జవహర్‌నగర్‌, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలకు సంబంధించిన డిసెంబర్‌ 2024 త్రైమాసిక సమావేశంలో పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, పీఎంఎఫ్‌ఎంఈ వంటి ప్రభుత్వ పథకాల అమలు, స్వయం సహాయక బృందాల పురోగతితో పాటు బ్యాంక్‌ శాఖల్లోని పెండింగ్‌ అంశాలపై సమీక్షించారు. లీడ్‌ డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ శివప్రసాద్‌, ఆర్బీఐ ఏజీఎం శ్రావ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వివిధ ప్రాంతాల బ్యాంకర్లు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికపై వీధి కుక్కల దాడి



ఉప్పల్‌: రెండేళ్ల బాలికపై వీధికుక్కలు ముక్కుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌ నల్ల చెరువు కట్ట పోచమ్మ దేవాలయ సమీపంలో బానోతు గణేష్‌, గీత దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె స్నేహ (02) శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటోంది. అదే సమయంలో గుంపుగా వచ్చిన వీధి కుక్కలు చిన్నారిపై దాడి చేశాయి. దాదాపు 10 మీటర్ల మేర లాక్కెళ్లాయి. దీనిని గుర్తించిన స్థానికులు వాటిని కర్రలతో తరిమి చిన్నారిని కాపాడారు. తీవ్రంగా గాయపడిన స్నేహను సమీపంలోని ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

లయోల కళాశాలలో క్రీడా పోటీలు


బహుమతులతో విజేత జట్టు

అల్వాల్‌: అల్వాల్‌లోని లయోల కళాశాలలో ఫాదర్‌ బాలయ్య మెమోరియల్‌ టోర్నమెంట్‌ పోటీలు నిర్వహించారు. 11 నుంచి 13 వరకు పురుషులు, మహిళల జట్లకు బాస్కెట్‌బాల్‌, బాల్‌బాల్‌, ఫుట్‌బాల్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగం బాస్కెట్‌బాల్‌కు 16 జట్లు, పురుషుల విభాగం వాలీబాల్‌కు 16 జట్లు, మహిళల బాస్కెట్‌బాల్‌కు 6 జట్లు, మహిళల వాలీబాల్‌ జట్లు 6 పాల్గొన్నాయి. ఇందులో పురుషుల బాస్కెట్‌బాల్‌లో విజేతగా లయోలా అకాడమీ, రెండో స్థానంలో వీఎస్‌ఆర్‌వైజేఐటీ, భవన్స్‌ వివేకానంద కళాశాల మూడో స్థానం, సెయింట్‌ జోసెఫ్‌ నాలుగో స్థానంలో నిలిచాయి. అల్వాల్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఫాదర్‌ చిలువూరు అమరరావు, కరస్పాండెంట్‌ ఫాదర్‌ డాక్టర్‌ ఎ.ఫ్రాన్సిస్‌ జేవీయర్‌, డాక్టర్‌ ఎన్‌.బి. బాబు, క్రీడా డైరెక్టర్‌ ఫాదర్‌ డాక్టర్‌ ఎ.ఎం జోసెఫ్‌కుమార్‌ హాజరై విజేతలకు బహుమతులు అందజేసినట్లు లయోల కళాశాల ప్రిన్సిపాల్‌ తెలిపారు.

జడ్జిపై దాడిని ఖండించిన బార్‌ అసోసియేషన్‌

కుషాయిగూడ: రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై జరిగిన దాడిని మల్కాజిగిరి బార్‌ అసోసియేషన్‌ ఖండించింది. ఈ సందర్భంగా న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఇది వ్యక్తిగతమైన దాడి కాదని న్యాయ వ్యవస్థపైనే దాడిగా పరిగణించాలని బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అక్రమ ఇసుక దందాపై పోలీసుల కొరడా

అల్వాల్‌: అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై శుక్రవారం పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేరేడ్‌మెట్‌లోని రామకృష్ణపురం రైతుబజార్‌, పూలపల్లి బాలయ్య కాలనీ పెట్రోల్‌బంక్‌, మూడుగుళ్ల ప్రధాన రహదారి, కాకతీయనగర్‌, ఓల్డ్‌ సఫీల్‌గూడ దర్గా, వాజ్‌పేయ్‌నగర్‌, పాత పోలీస్‌స్టేషన్‌, వాజ్‌పేయ్‌నగర్‌ గేట్‌, మల్కాజిగిరి మండల కార్యాలయం సమీపంలో వ్యాపారం నిర్వహిస్తున్న లారీలను తనిఖీ చేసి 79 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకోవడంతో పాటు 8 కేసులు నమోదు చేసినట్లు నేరేడ్‌మెట్‌ పోలీసులు తెలిపారు. అల్వాల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోనూ మచ్చబొల్లారం, అల్వాల్‌ ప్రధాన రహదారుల్లోనూ ఇసుక లారీలను సైతం పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

అనుమతుల్లేకుండా ఇసుక విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కుషాయిగూడ: అనుమతుల్లేకుండా ఇసుక విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాప్రా, మాధవపురి కాలనీకి చెందిన నీలపు అప్పన్న కొన్ని రోజులుగా చక్రిపురం లారీల అడ్డా నుంచి తక్కువ ధరకు ఇసుకను తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఓయూటీ కాలనీలో ఇసుక డంప్‌ను పరిశీలించారు. అతడిని విచారించగా టన్ను ఇసుకను రూ. 1500 తీసుకువచ్చి రూ. 1800 లకు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. దీంతో అప్పన్నపై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం!



మల్లాపూర్‌: మల్లాపూర్‌ అంబేడ్కర్‌ భవన్‌ విగ్రహం వద్దనున్న ఐమాక్స్‌ విద్యుత్‌ స్తంభం కింది భాగం తుప్పుపట్టి ప్రమాదకరంగా మారింది. గతంలో అంబేడ్కర్‌ సంఘం ఫిర్యాదు మేరకు విద్యుత్‌ శాఖ అధికారులు స్తంభం వద్ద సిమెంట్‌ వేసి మమ అనిపించారు. అయితే అదే స్తంభం మళ్లీ తుప్పుపట్టి ఎప్పుడూ కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని అంబేడ్కర్‌ సంఘం ప్రధాన కార్యదర్శి రఘు కోరారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

మౌలాలి: వినాయకనగర్‌ డివిజన్‌ పరిధిలోని జేకే కాలనీ (చర్చి గల్లీ)లో డ్రైనేజీ పనులను బీజేపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి చొరవతో రూ.16.50 లక్షల నిధులతో పనులు చేపట్టారన్నారు. ఓంప్రకాశ్‌, సాయిసురేశ్‌, జగదీశ్‌చారి, కాలనీవాసులు బీరయ్య, బ్రహ్మచారి, బాలకృష్ణ, అంకుష్‌, డాక్టర్‌ కార్తీక్‌ తదితరులు ఉన్నారు.

‘తులం బంగారం హామీ నెరవేర్చాలి’


కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఇచ్చిన తులం బంగారం హామీ నెరవేర్చాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా మండల కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. లక్ష 116 లతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చిందని అది కూడా అందిస్తే పేదింటి ఆడబిడ్డలకు ఎంతో మేలు చేసినవారవుతారన్నారు. కార్యక్రమంలో కాప్రా తహసీల్దార్‌ సుచరిత, కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ శివమణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

‘పీఎం విశ్వకర్మ’ పై అవగాహన కార్యక్రమం


మల్లాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మల్లాపూర్‌: అభయ అసోసియేషన్‌ ఫర్‌ ఎంపవర్‌మెంట్‌ ఆఫ్‌ ఉమెన్‌ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో ఎంఎస్‌ఎంఈ పీఎం విశ్వకర్మపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎంఎస్‌ఎంఈ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 200 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలతో ప్రోత్సాహం అందిస్తున్నదని, పీఎం లోన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్‌సీ మీసేవ అధికారి రాథోడ్‌, ఎంఎస్సీ డీఎఫ్‌ఓ విభాగం అసిస్టెంట్‌ డైరెక్టర్‌ నవీన్‌, డీఐసీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రఘునాథ్‌, కెనరా బ్యాంక్‌ లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ శివప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి


గౌతంనగర్‌లో నివాళులర్పిస్తున్న సభ్యులు


ర్యాలీలో పాల్గొన్న విద్యాజ్యోతి స్కూల్‌ విద్యార్థులు

గౌతంనగర్‌: మానవసేవే-మాధవసేవ వాట్సాప్‌ గ్రూప్‌ ఆధ్వర్యంలో గౌతంనగర్‌ చౌరస్తాలో జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా బాంబు దాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రూప్‌ అడ్మిన్‌ కుమ్మరి రాజు, ప్రతినిధులు మహ్మద్‌ రషీద్‌, ఉదిరి సత్యనారాయణ యాదవ్‌, డాక్టర్‌ సుధాకర్‌, జంగాల శ్రీరామ్‌ యాదవ్‌, వెంకటరమణ, మహ్మద్‌ షమీ, అబ్బు హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ..

బోడుప్పల్‌: పుల్వామా దాడికి నిరసనగా చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్‌ శ్రవణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే సమాజంతో పాటు దేశ సేవకు అంకితం కావాలని సూచించారు. ప్రిన్సిపాల్‌ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ మహంకాళి ఆలయ ట్రస్ట్‌ బోర్డు ప్రమాణ స్వీకారం


ప్రమాణం స్వీకారం చేయిస్తున్న ఈవో వీరేశం, ఇన్‌స్పెక్టర్‌ ప్రణీత్‌ తదితరులు

ఉప్పల్‌: ఉప్పల్‌ మహంకాళి ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా తెల్కల మోహన్‌రెడ్డి, ధర్మకర్తలుగా మాశెట్టి రాఘవేంద్ర కుమార్‌, మీనంపల్లి అండాలు, గుమ్మడెల్లి కృష్ణ, అలుగుల అనిల్‌ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీరేశం, ఇన్‌స్పెక్టర్‌ ప్రణీత్‌, కాంగ్రెస్‌ నేతలు బాకారం లక్ష్మణ్‌, సుధాకర్‌రెడ్డి, బజారు జగన్నాథ్‌ గౌడ్‌, చెన్‌ రెడ్డి రఘుపతి రెడ్డి, పూజల ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సంగీతంలో ప్రావీణ్యం సాధించాలి

హైదరాబాద్‌ కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి


సంగీత కచేరి వింటున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

ఘట్‌కేసర్‌: విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల్లో ప్రావీణ్యం పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి అన్నారు. మేడ్చల్‌ జిల్లా ఎదులాబాద్‌లోని తెలంగాణ సంఘిక సంక్షేమ లలిత కళల గురుకుల పాఠశాల, జూనియర్‌ కళాశాలలో ప్రముఖ సంగీతా విద్వంసులు గీతారాజా బృందంతో శుక్రవారం రాత్రి స్పిక్‌ మెక్‌ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్నాటిక్‌ సంగీత కచేరికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. లలిత కళల స్కూల్‌, కళాశాల విద్యార్థులు భారతీయ శాస్త్రీయ సంగీతంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సంయుక్త కార్యదర్శి సత్రునాయక్‌, ఓఎస్‌డీ పీఎస్‌ఆర్‌ శర్మ, రాష్ట్ర అధికారి భీమయ్య, ప్రిన్సిపాల్‌ రాము, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాములు, స్పిక్‌ మెక్‌ వలంటీర్‌ వీణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి

డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి

కీసర: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ సీ. ఉమాగౌరి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మాయిగూడ ఓల్డ్‌ విలేజ్‌లోగల బస్తీ దవాఖాన, అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలోగల బస్తీ దవాఖాన, కీసర సబ్‌సెంటర్‌, కీసర బస్తీ దవాఖాన, ఆరోగ్య, వెల్‌నెస్‌ సెంటర్లను శుక్రవారం ఆమె సందర్శించారు. హాజరు, అవుట్‌ పేషెంట్‌ (ఓపీ) ఫార్మసీ రిజిష్టర్లను పరిశీలించారు. అలాగే రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కీసరలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య, వెల్‌నెస్‌ సెంటర్‌ (పల్లె దవాఖాన) స్థలాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పల్లె దవాఖానకు కేటాయించిన స్థలంలో కొంతభాగం ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని ఈ విషయమై పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్లాపూర్‌: 33/11 కేవీ నాచారం ఇండోర్‌ స్టేడియం సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ సాయిబాబా ఆలయం ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని నాచారం ఏఈ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్రనగర్‌, ఇందిరానగర్‌. అలాగే 11 కేవీ వైజయంతి ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు వీరారెడ్డినగర్‌, కొండిన్యనగర్‌, అంబేడ్కర్‌నగర్‌, వైజయంతి టాకీస్‌ మెయిన్‌రోడ్‌, రవీంద్రనగర్‌లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

బోడుప్పల్‌లో..

బోడుప్పల్‌: పలు కాలనీల్లో శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పద్మావతి కాలనీ, బాలాజీహిల్స్‌, వెస్ట్‌ బాలాజీహిల్స్‌, మెక్‌డోల్‌కాలనీ, న్యూ హేమానగర్‌, కుమ్మరికుంట, న్యూ రాంనగర్‌, ఈస్ట్‌ బాలాజీ హిల్స్‌, స్వరూప్‌నగర్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

హబ్సిగూడ 11 కేవీ ఐఎస్‌ఐ ఫీడర్‌ పరిధిలో..

ఉప్పల్‌: హబ్సిగూడ 11 కేవీ ఐఎస్‌ఐ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10. 30 నుంచి 11 గంటల వరకు రవీంద్రానగర్‌ వీధినంబర్‌ 5 నుంచి 27 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ గణేశ్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ నాచారం ఫీడర్‌ మరమ్మతుల కారణంగా ఉదయం 11. 30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హరిజన బస్తీ, పీఅండ్‌టీ కాలనీ, కాకతీయనగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.